క్లుప్తంగా

కాంగ్రెస్ పార్టీలో చేరిక



ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న బీఆర్ఎస్ నాయకులు

నాగార్జునసాగర్: నందికొండ హిల్‌కాలనీలోని కుందూరు జానారెడ్డి నివాసంలో బుధవారం పలువురు బీఆర్ఎస్ నాయకులు ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా జానారెడ్డి మాట్లాడుతూ.. నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి తమ కుమారుడైన కుందూరు రఘువీర్‌రెడ్డిని అత్యధిక మెజార్టీలో గెలిపించి పార్లమెంట్‌కు పంపాలని కోరారు. పార్టీలో చేరిన వారిలో పెద్దవూర పీఏసీఎస్ చైర్మన్ గుంటుక వెంకట్‌రెడ్డి, నాయినివానికుంట మాజీ సర్పంచ్ వెంకటేశ్వర్లు, సీనియర్ నాయకులు బెడుదూరి వెంకట్‌రెడ్డి, పెద్దగూడెం మాజీ సర్పంచ్ మల్లారెడ్డి, పవన్‌కుమార్, భాస్కర్‌రెడ్డి, శరత్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, రామాంజిరెడ్డి, గోనియా నాయక్, సత్యనారాయణ, అమ్జానాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఛత్రపతి శివాజీకి నివాళి



ఛత్రపతి శివాజీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

దేవరకొండ: దేవరకొండ పట్టణంలో బుధవారం బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని ఛత్రపతి శివాజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో చింతపల్లి శ్రీనివాస్‌గౌడ్, చొల్లేటి భాస్కరాచారి, లింగయ్య, ఇంద్ర వరప్రసాద్, ఎన్‌వీటీ, నాగయ్య, కృష్ణ తదితరులు ఉన్నారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

మిర్యాలగూడ అర్బన్: అక్రమంగా మద్యం తరలిస్తుండగా బుధవారం రైల్వే స్టేషన్‌లో పోలీసులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. రైల్వే సీఐ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం .. ఎన్నికల కోడ్ నిబంధనల మేరకు బుధవారం రైల్వే స్టేషన్‌లో పోలీసులు తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా ఉన్న బ్యాగులను పరిశీలించారు. అందులో 15 మద్యం ఫుల్ బాటిళ్లను గుర్తించినట్లు తెలిపారు. మిర్యాలగూడ పట్టణం నుంచి ఆంధ్రాకు రేపల్లె ఎక్స్‌ప్రెస్‌లో తరలించేందుకు తెచ్చిన క్రమంలో వాటిని స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. మద్యంను ఎక్సైజ్ ఎస్ఐ రఘుకు సరెండర్ చేశామని చెప్పారు. తనిఖీల్లో ఆర్‌పీఎఫ్ ఎస్ఐ జీపీకే రెడ్డి, రైల్వే ఎస్ఐ సాలకమ్మ, కానిస్టేబుళ్లు వెంకన్న, అశ్వినికుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

డిండి: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ మాధవరం సునీతా జనార్దన్‌రావు అధ్యక్షతన గురువారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ డానియల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ శాఖల మండలాధికారులు తమ నివేదికలతో సకాలంలో హాజరు కావాలని ఆయన పేర్కొన్నారు.

14 మంది బైండోవర్

చందంపేట: పోలీస్‌స్టేషన్‌లో కేసులు ఉన్న చందంపేట మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 14 మందిని తహసీల్దార్ శ్రీనివాసులు ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్ఐ సతీష్ బుధవారం తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా వారిని ముందస్తు చర్యగా బైండోవర్ చేసినట్లు పేర్కొన్నారు.

అపెక్స్ ఒలింపియాడ్ పరీక్షల్లో విద్యార్థుల ప్రతిభ

మిర్యాలగూడ టౌన్: ఇటీవల హైదరాబాద్‌కు చెందిన అపెక్స్ ఒలింపియడ్ వారు నిర్వహించిన పరీక్షల్లో శిష్య స్కూల్‌కు చెందిన 32 మంది విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ అలుగుబెల్లి శ్రీనివాస్‌రెడ్డి, కరస్పాండెంట్ అలుగుబెల్లి శిరీష బుధవారం తెలిపారు. పరీక్షల్లో 5వ తరగతికి చెందిన ఎ.హర్షిణి, ఆర్.శ్రావ్య, వి.జ్ఞాన్ శ్రీకర్, 4వ తరగతికి చెందిన పూజిత, ఎం.జగతి గోల్డ్ మెడల్‌ను సాధించారని పేర్కొన్నారు. అదేవిధంగా 5వ తరగతి చదువుతున్న ఎం.మేఘన, యశ్వత, రోహిత్, వినిత్, 4వ తరగతి చదువుతున్న సాయి నిహారిక సిల్వర్ మెడల్స్ సాధించారని చెప్పారు. మరో 22 మంది విద్యార్థులు ప్రశంసపత్రాలు అందుకున్నట్లు తెలిపారు. వీరిని ప్రిన్సిపాల్ అలుగుబెల్లి శ్రీనివాస్‌రెడ్డి, కరస్పాండెంట్ అలుగుబెల్లి శిరీష అభినందించారు.

నవోదయ ఎంట్రెన్స్ ఫలితాల్లో..

దేవరకొండ: ఇటీవల విడుదలైన నవోదయ ఎంట్రెన్స్ ఫలితాల్లో దేవరకొండ పట్టణానికి చెందిన ప్రజ్ఞ కోచింగ్ సెంటర్‌కు చెందిన విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు కోచింగ్ సెంటర్ నిర్వాహకులు కుకుడాల కవిత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇద్దరు విద్యార్థులు జవహర్ నవోదయ రంగారెడ్డి జిల్లాకు ఎంపిక కాగా.. మరో ఆరుగురు నల్లగొండ జిల్లాకు ఎంపికైనట్లు పేర్కొన్నారు.

మున్సిపాలిటీలో కానరాని స్వచ్ఛత

- ఎక్కడ చూసినా చెత్తాచెదారం
- విజృంభిస్తున్న దోమలు

మిర్యాలగూడ టౌన్: పచ్చదనం, పరిశుభ్రతపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తున్నా క్షేత్రస్థాయిలో ఆశించిన ఫలితాలు రావడం లేదు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో వెనకబడుతున్నా దిద్దుబాటు చర్యలు కనిపించడం లేదు. మున్సిపాలిటీలో ఓపెన్ ప్లాట్లు ప్రజలకు ప్రాణ సంకటంగా మారగా.. మరోవైపు ఎక్కడపడితే అక్కడ మురుగునీరు నిలిచిపోవడంతో దోమలు పెరుగుతున్నాయి. దీంతో అంటు వ్యాధులతో ప్రజలు ఆస్పత్రులకు క్యూ కడుతున్నారు. మిర్యాలగూడ మున్సిపాలిటీలో 48 వార్డులుండగా సుమారు లక్షా33 వేల మంది జనాభా ఉన్నారు. వార్డుల్లో ఎక్కడపడితే అక్కడ మురుగు నీరు నిలిచి ఉండటంతో ఆ ప్రాంత వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మిర్యాలగూడ మున్సిపాలిటీలో డ్రైనేజీలు అస్తవ్యస్తంగా ఉన్నాయి. పలు వార్డుల్లో అంతర్గత రహదారులు సక్రమంగా లేవు. మంచినీటి సరఫరా సవ్యంగా జరగడం లేదు. మున్సిపల్ అధికారులు ఏనాడు వార్డుల్లో సమస్యలు తెలుసుకునేందుకు పర్యటించలేదన్న ఆరోపణలు ఉన్నాయి.



మిర్యాలగూడ పట్టణంలోని పెద్ద బజారులో ట్యాంకు వద్ద పేరుకుపోయిన చెత్తాచెదారం



మిర్యాలగూడ పట్టణంలోని కృష్ణకాలనీలో ఖాళీ స్థలంలో నిల్వ ఉన్న మురుగు

మున్సిపాలిటీలో వార్డులు	48
ప్రస్తుత జనాభా	1.33 లక్షలు
పారిశుద్ధ్య సిబ్బంది	278
రెగ్యులర్ సిబ్బంది	44
గృహాలు	26,506
నిత్యం వెలువడుతున్న చెత్త	70 మెట్రిక్ టన్నులు
ప్రస్తుతం నడుస్తున్నవి	36 ఆటోలు, ట్రాక్టర్లు

ఖాళీ స్థలాలతో మరింత ఇబ్బందులు..

ఇళ్ల మధ్యలోనే ఖాళీ స్థలాలు ఉండటంతో ప్లాట్ల పక్కన వారు ఆ ఖాళీ స్థలాలకు మురుగునీరు మళ్లించడంతో ఆ స్థలాలన్నీ మురుగుగా మారుతున్నాయి. అధికారులతో పాటు స్థలాల యాజమానులు కూడా ఖాళీ స్థలాలపై దృష్టి సారించకపోవడంతో పిచ్చి మొక్కలు పెరుగుతున్నాయి. మురుగుతో దోమలు పెరిగి వ్యాధుల బారిన పడే అవకాశం ఉందని స్థానిక ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు.

దోమలు విపరీతంగా పెరిగాయి



మున్సిపాలిటీలో ఏ కాలనీలో చూసినా చెత్తాచెదారం దర్శనం ఇస్తోంది. కాలువలు అస్తవ్యస్తంగా మారి దోమలు విపరీతంగా పెరిగాయి. వ్యాధుల బారిన పడుతున్నాం. దోమల బెడదను నియంత్రించేందుకు మున్సిపల్ సిబ్బంది కేవలం నడిరోడ్డుపై ఫాగింగ్ చేస్తున్నారు. కానీ మురుగు కాలువల్లో చేయడం లేదు. మురుగు కాలువల్లో ఫాగింగ్ చేసే విధంగా చర్యలు తీసుకోవాలి.

– మందడి వేణుగోపాల్‌రెడ్డి, మిర్యాలగూడ

పారిశుద్ధ్య సిబ్బందిని అప్రమత్తం చేస్తాం



మున్సిపాలిటీలో పారిశుద్ధ్య వ్యవస్థపై ప్రత్యేక దృష్టి సారిస్తాం. దోమల నియంత్రణకు యుద్ధ ప్రాతిపదికన ప్రత్యేక చర్యలు తీసుకుంటాం. ఇందుకు పారిశుద్ధ్య సిబ్బందిని అప్రమత్తం చేసి నిల్వ ఉన్న చెత్తను డంపింగ్ యార్డుకు తరలించేందుకు ప్రత్యేకంగా చర్యలు తీసుకుంటాం. ఖాళీ ప్లాట్ల యాజమానులకు మరోసారి నోటీసులు జారీ చేస్తాం.

– ఎండీ యూసుఫ్, మున్సిపల్ కమిషనర్, మిర్యాలగూడ

ప్రజలు కేసీఆర్‌ను విశ్వసించడం లేదు

- ఎమ్మెల్యే బాలునాయక్



సమావేశంలో మాట్లాడుతున్న బాలునాయక్

దేవరకొండ: తెలంగాణ ప్రజలు మాజీ సీఎం కేసీఆర్‌ను విశ్వసించడం లేదని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. బుధవారం దేవరకొండ పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యుత్ సంస్థను అప్పుల పాలు చేసి విద్యుత్ ఉద్యోగులకు కనీసం ఒకటో తేదీన జీతాలు ఇవ్వలేని పరిస్థితి తీసుకొచ్చింది గత కేసీఆర్ ప్రభుత్వమేనని విమర్శించారు. విద్యుత్ సరఫరాలో రైతాంగానికి, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. జిల్లాలో ఉన్న బీఆర్ఎస్ నాయకులు గతంలో ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టును, డిండి లిఫ్టును పూర్తి చేసి ఉంటే ఇప్పుడిలా జిల్లాలో నీటి కొరత ఏర్పడేది కాదన్నారు. నల్లగొండ జిల్లాను ఎడారిగా మార్చింది కేసీఆర్ అని ఆరోపించారు. బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీపై విష ప్రచారాలు చేస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. సమావేశంలో లచ్చిరాంనాయక్, పార్లమెంట్ కో ఆర్డినేటర్ సిరాజ్‌ఖాన్, కిన్నెర హరికృష్ణ, పున్న వెంకటేష్ తదితరులున్నారు.

ఉమామహేశ్వర ఆలయ కమిటీ చైర్మన్‌గా వెంకట్‌రెడ్డి

వేములపల్లి: మండలంలోని శెట్టిపాలెం గ్రామంలో గల శ్రీ ఉమామహేశ్వరస్వామి దేవాలయ చైర్మన్‌గా బుసిరెడ్డి వెంకట్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన సమావేశంలో ఆలయ కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆలయ ప్రధాన కార్యదర్శిగా ధూపాటి శ్రీను, కోశాధికారిగా వనం లక్ష్మీనర్సయ్య, ఉపాధ్యక్షుడిగా మజ్జిగపు రాంరెడ్డి, సభ్యులుగా పెదమాం వెంకన్న, పల్లా సైదులు, సైదిరెడ్డి, నారాబత్తుల పవన్, పల్లా వెంకటయ్య, రేణికుంట వెంకన్న, రాములు తదితరులను ఎన్నుకున్నారు.

నేడు డిండిలో కాంగ్రెస్ కార్యకర్తల మహాసభ

డిండి: పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా డిండి మండల కేంద్రంలో గురువారం నిర్వహించే కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల మహాసభకు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆ పార్టీ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొంతినేని వెంకటేశ్వరరావు, మండలాధ్యక్షుడు నల్లవెల్లి రాజేష్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సీఎల్పీ మాజీ నేత కుందూరు జానారెడ్డి, దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలూనాయక్, పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డి హాజరవుతున్నారని పేర్కొన్నారు.

చైతన్య విప్లవ స్ఫూర్తి దొడ్డి కొమురయ్య

మిర్యాలగూడ అర్బన్: తెలంగాణ సాయుధ పోరాటానికి తొలి అమరుడు దొడ్డి కొమురయ్య విప్లవ స్ఫూర్తి అని యాదవ ఉద్యోగుల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు నర్సాల వెంకయ్య, మిర్యాలగూడ డివిజన్ అధ్యక్షుడు గుడిపాటి కోటయ్య అన్నారు. బుధవారం దొడ్డి కొమురయ్య జయంతి సందర్భంగా మిర్యాలగూడ పట్టణంలోని యాదవ సంఘం భవనంలో ఆయన చిత్ర పటానికి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ సామాజిక దోపిడీకి గురవుతున్న అణగారిన వర్గాల ప్రజల కోసం, వారి అభివృద్ధి కోసం నిరంతరం ప్రయత్నం చేయాలన్నారు. కార్యక్రమంలో యాదవ ఉద్యోగుల సంఘం నాయకులు పసుల కాశయ్య, ఆర్వ అశోక్, డొంకల వెంకటేశ్వర్లు, కలికబోయిన కోటయ్య, జానపాటి శ్రీనివాస్, దారం నాగరాజు, చిర్ర మల్లయ్య, గుడిపాటి వెంకటేశ్వర్లు, గంగుల బిక్షం, బచ్చన బోయిన మహేష్ తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా మిర్యాలగూడ పట్టణంలోని అమరవీరుల స్తూపం వద్ద బీసీ జేఏసీ ఆధ్వర్యంలో దొడ్డి కొమరయ్య జయంతి నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం డివిజన్ కార్యదర్శి చేగొండి మురళియాదవ్, మలికంటి వెంకటయ్య, దాసరాజు జయరాజు, కుమ్మరికుంట సుధాకర్, చారి, జ్వాలా సురేష్, గంగరాజు, అంజి తదితరులు పాల్గొన్నారు.



దొడ్డి కొమురయ్య జయంతి కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

బీజేపీ అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ పదవికి రాజీనామా

మిర్యాలగూడ టౌన్: బీజేపీ అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ పదవికి బాణావత్ రతన్‌సింగ్ నాయక్ బుధవారం రాజీనామా చేశారు. ఈమేరకు రాజీనామా లేఖను బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి పంపించారు. కొంతమంది పార్టీ నేతలు తనను కన్వీనర్ బాధ్యతలు నిర్వర్తించకుండా ఆటంకం కల్పించడంతో పాటు, వ్యక్తిగతంగా, రాజకీయంగా దెబ్బతీసేలా వ్యవహరిస్తున్నందున కన్వీనర్ పదవికి రాజీనామా చేసినట్లు పేర్కొన్నారు. ఇక మీదట పార్టీ కార్యకర్తగానే కొనసాగుతానని లేఖలో పేర్కొన్నారు.

బీజేవైఎం సాగర్ నియోజకవర్గ కన్వీనర్‌గా సైదులు

మాడుగులపల్లి : భారతీయ జనతా యువ మోర్చా (బీజేవైఎం) కన్వీనర్‌గా మాడుగులపల్లి మండలంలోని అభంగాపురం గ్రామానికి చెందిన కడియం సైదులు నియామకమయ్యారు. ఈ మేరకు బుధవారం యువ మోర్చా జిల్లా అధ్యక్షుడు వంగూరి రాఖీ జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో సైదులుకు నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో బీజేపీ బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని తెలపారు.

ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

మిర్యాలగూడ టౌన్: మండలంలోని తక్కెళ్లపాడులో బుధవారం అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లు పోలీసులు పట్టుకొని సీజ్ చేశారు. మిర్యాలగూడ రూరల్ ఎస్ఐ నరేష్ వివరాల ప్రకారం.. తక్కెళ్లపాడు గ్రామ శివారులోని వాగు నుంచి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లు సమాచారం మేరకు పట్టుకొని స్టేషన్‌కు తరలించారు. ఈమేరకు గ్రామానికి చెందిన చొగాని సతీష్, చొగాని సైదులుపై కేసు నమోదు చేసి ట్రాక్టర్లు సీజ్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

కక్ష సాధింపు చర్యలు మానుకోవాలి

హాలియా: నాగార్జునసాగర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు బీఆర్ఎస్ నేతలపై రాజకీయ కక్ష సాధింపులకు పాల్పడుతున్నారని, ఈ చర్యలు మానుకోవాలని సాగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నేతలు అన్నారు. బుధవారం హాలియా పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. సాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి, సీఎల్పీ మాజీ నేత కుందూరు జానారెడ్డి అధికారాన్ని, ప్రభుత్వ అధికారులను అడ్డంపెట్టుకుని సాగర్ హిల్ కాలనీలో మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ ఇంటిని సీజ్ చేయించారని ఆరోపించారు. వంద రోజుల్లో కాంగ్రెస్ పాలనలో విఫలం చెందిందని విమర్శించారు. సాగర్ ఎస్‌పీస్పీ క్వాటర్స్‌లో మాజీ ఎమ్మెల్యే కుందూరు జానారెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు నివాసం ఉండగా నోముల భగత్ ఎందుకు నివాసం ఉండకూడదని ప్రశ్నించారు. కార్యక్రమంలో వివిధ మండలాల అధ్యక్షులు కూరాకుల వెంకటేశ్వర్లు, పిడిగం నాగయ్య, జటావత్ రవినాయక్, తాటి సత్యపాల్, మాజీ మార్కెట్ చైర్మన్లు జవాజి వెంకటేశ్వర్లు, కామర్ల జానయ్య, నాయకులు నల్లగొండ సుధాకర్, చాపల సైదులు, ఆదేపు రామలింగయ్య, అనుముల శ్రీనివాస్‌రెడ్డి, గుండెబోయిన వెంకన్న, సురభి రాంబాబు, పొదిల శ్రీను, ఉడ్తూరి శ్రీనివాస్‌రెడ్డి, మెరుగు రామలింగయ్య, బొమ్మిశెట్టి ఆంజనేయులు, తరి పెద్దులు, జంగిలి శ్రీను పాల్గొన్నారు.



సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు

'నోముల భగత్ మతిభ్రమించి మాట్లాడుతున్నారు'



మాట్లాడుతున్న కర్నాటి లింగారెడ్డి

నాగార్జునసాగర్: మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ మతిభ్రమించి, అవగాహన రాహిత్యంతో మాట్లాడుతున్నారని టీపీసీసీ కార్యదర్శి కర్నాటి లింగారెడ్డి ఆరోపించారు. బుధవారం నందికొండ మున్సిపాలిటీ హిల్‌కాలనీలోని ఆయన నివాసంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నందికొండ హిల్‌కాలనీలో గల ఈఈ19 క్వార్టర్ నోముల భగత్ వ్యక్తిగత నివాసం కాదని, అది కేవలం ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసు పేరుతో ప్రభుత్వం అలాట్ చేసిందని తెలిపారు. ఎమ్మెల్యే పదవిలో ఉన్న వారు మాత్రమే అక్కడి నుంచి కార్యకలాపాలు నిర్వహించాలన్నారు. భగత్ ఎమ్మెల్యే పదవి పూర్తికాగానే ఖాళీ చేయాలని నోటీసులు ఇచ్చినా.. ఖాళీ చేయకపోవడంతో ఆర్డీఓ స్థాయి అధికారి చట్టప్రకారం దగ్గరుండి ఖాళీ చేయించారని, దీంట్లో రాజకీయ ఉద్దేశమేమీ లేదన్నారు. సమావేశంలో తుమ్మలపల్లి శేఖర్‌రెడ్డి, శంకర్‌నాయక్, కౌన్సిలర్లు మంగ్తానాయక్, రామకృష్ణ, ఉంగరాల శ్రీను, రంగారెడ్డి, విక్రమ్, మోహన్‌నాయక్ పాల్గొన్నారు.

రాష్ట్రీయ కళామంచ్ సింగిడి పోస్టర్ ఆవిష్కరణ



మిర్యాలగూడలో సింగిడి కార్యక్రమం వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న అఖిల్‌రెడ్డి తదితరులు

మిర్యాలగూడ టౌన్: ఉస్మానియా యూనివర్సిటీలో ఈనెల 20, 21వ తేదీల్లో ఏబీవీపీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న రాష్ట్రీయ కళామంచ్ సింగిడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నల్లగొండ జిల్లా సంఘటన కార్యదర్శి సామల అఖిల్‌రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం కేఎస్ఎం, విజేత, హాసిత డిగ్రీ కళాశాలల్లో ఏబీవీపీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రీయ కళామంచ్ సింగిడి 2024 వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. ఏబీవీపీ అంటే కేవలం ధర్నాలు, రాస్తారోకోలు కాకుండా విద్యా రంగ సమస్యలపై నిత్యం పోరాడుతూ విద్యార్థులను చైతన్యం చేస్తున్న ఏకైక సంఘం ఏబీవీపీ మాత్రమేనని అన్నారు. కళా నైపుణ్యాలను ప్రపంచానికి పరిచయం చేసేందుకు రాష్ట్రీయ కళామంచ్ సింగిడి -2024 పేరుతో ముందుకు రావడం జరిగిందని తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు విద్యార్థులు భారీగా తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో ఏబీవీపీ నగర కార్యదర్శి బొల్లెపల్లి మధుమోహన్‌రాజు, పగిడిపల్లి శ్రీకాంత్, కూరపాటి నాగేందర్‌రాజు, అభి తదితరులున్నారు.

ఇఫ్తార్ విందుతో పెంపొందనున్న స్నేహభావం

కొండమల్లేపల్లి: ఇఫ్తార్ విందుతో స్నేహభావం పెంపొందుతుందని దేవరకొండ మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ అన్నారు. బుధవారం కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో పస్నూరి యుగేంధర్‌రెడ్డి ఆధ్వర్యంలో ముస్లింలకు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీపీ నల్లగాసు జాన్‌యాదవ్, నాయకులు వడ్త్య దేవేందర్‌నాయక్, శిరందాసు కృష్ణయ్య, మాడ్గుల యాదగిరి, వస్కుల కాశయ్య, బూడిద మల్లేశ్‌యాదవ్, బొడ్డుపల్లి శంకర్, ముస్లింలు నజీర్ మౌలానా, సలాం, గౌస్, నిరంజన్, సుకూర్, ముజీబ్, ఖాదర్ పాల్గొన్నారు.

నిడమనూరు: మండల కేంద్రంలో బుధవారం రాత్రి కాంగ్రెస్ నాయకులు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి హాజరయ్యారు. ఆయన వెంట కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అంకతి సత్యం, చిన వీరయ్య, సతీష్, చేకూరి వంశీ, కోలా శ్యామ్, ఖలీల్ బాషా, శంషు, జహంగీర్, మషీర్, దస్తగిరి పాల్గొన్నారు.



నిడమనూరు: ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి, నాయకులు

సోదరభావంతో మెలగాలి

మాడుగులపల్లి: కులమతాలకతీతంగా సోదరభావంతో మెలగాలని కుక్కడం తాజా మాజీ సర్పంచ్ అలుగుబెల్లి గోవిందరెడ్డి అన్నారు. మాడుగులపల్లి మండలంలోని కుక్కడం గ్రామంలో బుధవారం ముస్లింలకు ఆయన ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో జాఫర్, జానీ, షబ్బీర్, సర్దార్, సయ్యద్, సత్యనారాయణశర్మ, శ్రీను, రామస్వామి, జానయ్య, నగేష్, రాబర్ట్, సోములు ఉన్నారు.

ట్యాంకును శుభ్రం చేసాకే నీటిని విడుదల చేస్తాం

- నాగార్జునసాగర్ ప్రాజెక్టు సూపరింటెండెంట్ ఇంజనీర్ నాగేశ్వరరావు

నల్లగొండ: నాగార్జునసాగర్ హిల్ కాలనీలోని నీటి ట్యాంకులో కోతులు పడి చనిపోవడంతో ట్యాంకును పూర్తిస్థాయిలో శుభ్రం చేసిన తర్వాతే తాగునీటిని విడుదల చేస్తామని నాగార్జునసాగర్ ప్రాజెక్టు సూపరింటెండెంట్ ఇంజనీర్ నాగేశ్వరరావు తెలిపారు. అప్పటివరకు ఈ ట్యాంకు ద్వారా నీరు పొందుతున్న ఇళ్లకు ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా నీటిని సరఫరా చేస్తామని పేర్కొన్నారు. ట్యాంకులో కోతులు పడి చనిపోయిన సంఘటనపై బుధవారం ఆయన స్పందించారు. నందికొండ హిల్ కాలనీలో 2వేల లీటర్ల సామర్థ్యం ఉన్న రెండు తాగునీటి ట్యాంకులు, వేయి లీటర్ల సామర్థ్యం ఉన్న ఒక ట్యాంకు ఉందని తెలిపారు. అదేవిధంగా కోతులు పడి చనిపోయిన మరో తాగునీటి ట్యాంకు కూడా వేరుగా ఉందని చెప్పారు. ఈ ట్యాంకు ద్వారా కేవలం 50 ఇళ్లకు మాత్రమే తాగునీటిని సరఫరా చేస్తున్నామని, గత మూడు రోజులుగా ఈ ట్యాంక్ నుంచి నీరు సరఫరా కావడం లేదని, ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. చనిపోయిన కోతులను ట్యాంక్ నుంచి తీసేసి శుభ్రం చేసినట్లు తెలిపారు.

కార్యకర్తలను ఇబ్బంది పెడితే సహించబోం



నారాయణరెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

రామగిరి(నల్లగొండ): తిప్పర్తి మండలంలో కాంగ్రెస్ పార్టీ జెండా మోసిన కార్యకర్తలను ఇబ్బందులు పెడితే సహించబోమని పీసీసీ జనరల్ సెక్రటరీ వల్లె నారాయణరెడ్డి అన్నారు. బుధవారం తిప్పర్తి మండలం మర్రిగూడలో ఆయన మాట్లాడారు. ఇటీవల బీఆర్ఎస్ పార్టీ నుంచి వచ్చిన ఓ నాయకుడు కార్యకర్తలను బెదిరింపులకు గురి చేస్తున్నాడని మండిపడ్డారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డిల దృష్టికి తీసుకెళతానని అన్నారు. పార్టీ కోసం కష్టపడిన కాంగ్రెస్ కార్యకర్తలకు అండగా ఉంటానని అన్నారు. అనంతరం నారాయణరెడ్డిని స్థానిక కాంగ్రెస్ నాయకులు సన్మానించారు.

ఆగని గుడుంబా విక్రయాలు

- మళ్లీ ఊపందుకున్న సారా తయారీ
- మాల్‌లో జోరుగా బెల్లం విక్రయాలు
- నామమాత్రపు దాడులతో సరిపెడుతున్న అధికారులు

చింతపల్లి: పల్లెల్లో గుడుంబా గుప్పుమంటోంది. గత కొంతకాలం క్రితం అధికారుల దాడులతో గప్‌చుప్‌గా ఉన్న గుడుంబా విక్రయాలు మళ్లీ ఊపందుకున్నాయి. చింతపల్లి మండలం హైదరాబాద్–నాగార్జునసాగర్ రాష్ట్ర రహదారికి సమీపంలో ఉండడంతో ఇక్కడ తయారైన నాటు సారాను హైదరాబాద్ నగరానికి సరఫరా చేస్తున్నారు. కాగా.. సారా మహమ్మారికి భర్తలను కోల్పోయిన మహిళలు గత మూడేళ్లలో వెయ్యి మందికిపైగానే ఉన్నారు. వితంతు పింఛన్లు పొందే వారిలో 60 శాతానికిపైగా మహిళలు గుడుంబా కారణంగా భర్తను కోల్పోయిన వారే. చింతపల్లి మండలంలోని వింజమూరు గ్రామంలోని సుమారు 24 నుంచి 30 కుటుంబాలు సారాకు బానిసై తల్లిదండ్రులు మృతి చెందడంతో వారి పిల్లలు ఒంటరిగా బతుకీడుస్తున్నారు.



సారాను ధ్వంసం చేస్తున్న పోలీసులు (ఫైల్)

తయారీ కేంద్రాలు ఇవే..

చింతపల్లి మండల పరిధిలోని జర్పులతండా, దేన్యతండా, రోటిగడ్డతండా, చౌళ్లతండా, ఎర్రగడ్డతండా, కుద్యతండా, పాలెంతండా, కొక్కిరాల గౌరారం, మాన్‌సింగ్‌తండా, వెంకటంపేటతండా, జర్పులతండాలలో సారా తయారీకి కేంద్రాలుగా మారాయి. ఇక్కడ తయారైన గుడుంబాను గ్రామాల్లో విక్రయిస్తున్నారు. ఈ తండాల్లో తయారు చేసిన గుడుంబాను ఏకంగా ఆర్టీసీ బస్సుల్లో హైదరాబాద్‌కు తరలిస్తుండగా గతంలో పోలీసులకు పట్టుబడిన సంఘటనలు కూడా ఉన్నాయి. గుడుంబా తయారీ కేంద్రమైన తండాల్లో అధికారులు అడపాదడప దాడులు నిర్వహిస్తూ కేసులు నమోదు చేస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. పూర్తి స్థాయిలో గుడుంబా నియంత్రణకు చర్యలు తీసుకోవాల్సిన ఎక్సైజ్ పోలీసు అధికారులు తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.

నసర్లపల్లిలో జోరుగా విక్రయాలు..

మండల పరిధిలోని హైదరాబాద్–నాగార్జునసాగర్ రాష్ట్ర రహదారిపై నసర్లపల్లి ఎక్స్‌రోడ్డు గుడుంబా విక్రయాలకు అడ్డాగా మారింది. చుట్టుపక్కల గ్రామాల్లో తయారు చేసిన సారాను నసర్లపల్లి ఎక్స్‌రోడ్డు వద్ద రాత్రి పగలు తేడా లేకుండా రోడ్లపైనే బహిరంగంగా విక్రయిస్తున్నారు. నసర్లపల్లితో పాటు సమీపంలోని వెంకటంపేట ఇటుక బట్టీల్లో పని చేసే స్కిన్నింగ్ మిల్లు, పత్తి మిల్లుల్లో పని చేసే కూలీలు గుడుంబాకు బానిసలుగా మారుతున్నారు.

మాల్ కేంద్రంగా బెల్లం విక్రయాలు

మండలంలోని మాల్ వెంకటేశ్వరనగర్ మూడు జిల్లాల కూడలి కావడంతో ఇక్కడ బెల్లం అక్రమ వ్యాపారం జోరుగా సాగుతోంది. కొంతమంది వ్యాపారులు ఏకంగా కిరాణా దుకాణంలో నల్ల బెల్లం పట్టికను జోరుగా విక్రయిస్తున్నారు. మాల్ నుంచి మాడ్గుల, మర్రిగూడెం, యాచారం, చింతపల్లి మండల కేంద్రాలకు నిత్యం బెల్లం సరఫరా జరుగుతోందని సమాచారం.

చర్యలు తీసుకోవాలి



గ్రామాల్లో సారాకు బానిసై ఎన్నో కుటుంబాలు వీధిన పడుతున్నాయి. ఎక్సైజ్, పోలీసు అధికారులు అడపాదడపా దాడులు చేసి చేతులు దులుపుకుంటున్నారు. మాల్ వెంకటేశ్వరనగర్‌లో బెల్లం విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి అక్రమ వ్యాపారులపై చర్యలు తీసుకోవాలి.

– వెంకటయ్య, సీపీఐ మండల కార్యదర్శి

ఉపాధి కూలీలకు పెండింగ్ బిల్లులు చెల్లించాలి



కొత్తపల్లిలో కూలీలతో మాట్లాడుతున్న సరోజ

నల్లగొండ టౌన్ : ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలకు రావాల్సిన పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం మహిళా కూలీల జిల్లా కన్వీనర్ దండెంపల్లి సరోజ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం కొత్తపల్లి గ్రామంలో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలను కలిసి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధి హామీ కూలీలకు ఇస్తున్న కూలి గిట్టుబాటు కావడం లేదన్నారు. పనులు చేసే చోట కూలీలకు నీడ, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, తాగునీటి సౌకర్యం కల్పించాలన్నారు. కూలీల సమస్యలన్నీ వెంటనే పరిష్కరించడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పరమేష్, రామ్మోహన్, పబ్బిశ్ర లింగమ్మ, ఎల్లమ్మ, సౌందర్య, శ్రీధర్‌రెడ్డి, వెంకన్న, రేణు, పుష్పలత, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.